## క్లుప్తంగా

### గాయకురాలికి ఆర్థిక సహాయం


రాణికి ఆర్థిక సహాయం చేస్తున్న సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): నగరంలో ఆర్థిక ఇబ్బందులతో ఆవేదన చెందుతున్న గాయకురాలు రాణికి ఆర్కెస్ట్రా కళాకారుల సేవా సంక్షేమ సంఘం ఆర్థికంగా చేయూతనందించింది. స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బీవీ ప్రకాష్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధారాణి, చంద్రకంటి మద్దయ్య తదితరులు రాణికి రూ.40.50 వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పేద కళాకారులను ఆదుకునేందుకు సంఘం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో నూతన ఆర్గనైజింగ్ కార్యదర్శి పుష్పరాజ్, సంయుక్త కార్యదర్శి నాగశేషు, 2వ వార్డు కార్పొరేటర్ అబ్దుల్ లతీఫ్, రాయలసీమ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతరత్నం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్‌యార్డులో టాయ్‌లెట్ బ్లాక్‌లు


టాయ్‌లెట్ల బ్లాక్‌ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు, హమాలీలు తదితరుల సౌకర్యార్థం అదనంగా మూడు టాయ్‌లెట్ల బ్లాక్‌లను నిర్మిస్తున్నట్లు సెక్రటరీ గోవిందు తెలిపారు. సోమవారం ఆయన టాయ్‌లెట్స్ నిర్మాణాలను భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్ కమిటీపై ఎటువంటి ఆర్థిక బారం పడకుండా బిల్ట్ ఆపరేటివ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతి కింద వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సుబేదా అనే సంస్థ బిల్ట్ ఆపరేటివ్ ట్రాన్స్‌ఫర్ కింద టాయ్‌లెట్‌ల బ్లాక్‌లను నిర్మించడంతో పాటు 25 ఏళ్ల నిర్వహించిన తర్వాత మార్కెట్ కమిటీకి అప్పగిస్తుందని తెలిపారు. ఈ బ్లాక్‌లను సుబేదా సంస్థ 90 రోజుల్లో నిర్మిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణకు మారుపేరు పీఈటీలు



కోఆర్డినేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్

కర్నూలు (టౌన్): క్రమశిక్షణకు మారుపేరు వ్యాయామ ఉపాధ్యాయులని డీఈఓ శామ్యూల్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక టౌన్‌మోడల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల నియోజకవర్గ కో- ఆర్డినేటర్లతో డీఈఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో స్కూల్ గేమ్స్ పోటీలు, ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను ఈసందర్భంగా ఆయన అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి ప్రోత్సాహకంగా రూ.5 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, మండల నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు శ్రీనివాసులు, శేఖర్, వెంకటేశ్వర్లు, నిర్మల, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### రాష్ట్రపతిని కలిసిన మాజీ ఎంపీ



కర్నూలు కల్చరల్: మాజీ రాజ్య సభ సభ్యుడు టీజీ వెంకటేశ్ సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ సంస్థ ఇటీవల ఆయనకు 14వ సంసద్ మహారత్న అవార్డు అందజేసింది. ఈ నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిసిన టీజీని రాష్ట్రపతి అభినందించారు.

### కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.242 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు

# ఇన్నాళ్లు ఎక్కడ దాక్కున్నారు?

- కరోనా సమయంలో ప్రజలు గుర్తుకు రాలేదా?
- టీడీపీ నేతల తీరుపై మేయర్, ఎమ్మెల్యే ఆగ్రహం
- ఎన్నికల సమయంలోనే వారు కనిపిస్తారని ధ్వజం
- సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి
- నగరంలో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం


సీసీ రోడ్డు, కాల్వల నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): '2019 ఎన్నికల తర్వాత పత్తా లేకుండా పోయిన టీడీపీ నేతలు ఇప్పుడు మళ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటతో బయటకు వస్తున్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసేందుకు సైకిల్ యాత్ర పేరుతో తిరుగుతున్నారు. ప్రజలపై నిజమైన ప్రేమ ఉంటే ఇన్నాళ్లు ఎక్కడ దాక్కున్నారు. కరోనా సమయంలో కూడా ప్రజలు మీకు గుర్తుకు రాలేదా? అని తెలుగుదేశం నాయకులను నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలోనే వారికి ప్రజలు గుర్తుకు వస్తారని మండిపడ్డారు. సోమవారం సాయంత్రం స్థానిక 46 వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో రూ.1.20 కోట్లతో సీసీ కాల్వలు, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అలాగే 48 వ వార్డులో రూ.80 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు , 51 వ వార్డులో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ కాల్వల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గేట్ వే ఆఫ్ కర్నూలును గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. 2019లో వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వందలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. మారిన నగర రూపురేఖలే అందుకు నిదర్శనమన్నారు. స్వచ్ఛతతో రాష్ట్రంలోనే కర్నూలు నగరం రెండో స్థానంలో నిలిచిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను పరిష్కరించామన్నారు. ప్రజల గోడు పట్టని తెలుగుదేశం నేతలు ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడటంతో ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. వారికి ఓటుతో మరోసారి బుద్ధి చెప్పాలన్నారు. ఇంటింటికీ సంక్షేమం అందించిన జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసరావు, సయ్యద్ మల్లిఖాబేగం, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య, పార్టీ నాయకులు తెలుగు అనిల్, ఖలీద్, గౌస్, నసీర్, వార్డు ఇన్‌చార్జ్ క్రిష్ణకాంత్ శర్మ, కృప, మనోహర్, భార్గవ్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

**సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత**

స్థానిక సెంట్రల్ ప్లాజాలో నివసించే క్రాంతికుమార్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 3 లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును సోమవారం ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వారికి అందజేశారు.

**ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ**

ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సోమవారం తన స్వగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. వాటిని ఎమ్మెల్యే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## కలెక్టరేట్‌లో మరమ్మతులు త్వరగా పూర్తి చేయండి


సునయన ఆడిటోరియంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను త్వరతిగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగం, సునయన ఆడిటోరియంలో జరుగుతున్న మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఎలక్ట్రిక్ వైర్లను బయటకు కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆడిటోరియాన్ని అందంగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని ఆర్అండ్‌బీఅధికారులను ఆదేశించారు. ఆమె వెంట డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఆర్అండ్‌బీఎస్ఈ నాగరాజు, ఈఈ సురేష్ ఉన్నారు.

## ఆర్‌యూలో టైంస్కేల్ వర్తింపజేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో అర్హులైన "టీచింగ్ ఉద్యోగులకు టైంస్కేల్ వర్తింప చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. విశ్వవిద్యాలయంలో గతంలో 5 సంవత్సరాల సర్వీసు పూర్తి అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులు 105 మందికి టైంస్కేల్ ఇచ్చారన్నారు. కొంత మంది అర్హులైన ఉద్యోగులకు 10 సంవత్సరాల సర్వీస్ పూర్తి అయినా టైం స్కేల్ వర్తింప చేయలేదన్నారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, జిల్లా కార్యదర్శి వెంకటేష్ తదితరలు వీసికి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

## 29న సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్: గాడిచర్ల హరిసర్వోత్తమ రావు 64వ వర్ధంతిని పురస్కరించుకొని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు సాహితీ సదస్సు ఏర్పాటు చేసినట్లు గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. గాడిచర్ల ఫౌండేషన్, కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో ముచ్చుకోట లక్ష్మీదేవమ్మ గాడిచర్ల రమాబాయి స్మారకోపన్యాసం ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. 'తెలుగు నాట ఆధునిక స్త్రీ పర్వ ప్రస్థానం' అనే అంశంపై ముఖ్య వక్తగా హైదరాబాద్ మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం హిస్టరీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్ మహబూబ్‌బాషా ప్రసంగిస్తారని తెలిపారు. సాహితీ ప్రియులందరూ పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు.

## నేడు జేఏసీ ర్యాలీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఆర్థికపరమైన డిమాండ్‌లను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) చైర్మన్ వీసీహెచ్ వెంగళరెడ్డి తెలిపారు. డిమాండ్‌లను సాధించుకోవడం లక్ష్యంగా ఈ నెల 14 నుంచి వివిధ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని, తాజాగా ఈ నెల 20న భారీ ఎత్తన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ... జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే ర్యాలీలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. 20 రకాల డిమాండ్‌లను సాధించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ జేఏసీ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జేఏసీ వైస్ చైర్మన్ జవహర్‌లాల్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న పాల్గొన్నారు.

## నేడు భగవద్గీత సామూహిక పారాయణం

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో మాఘ భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని సంకల్‌బాగ్‌లోని శ్రీ గీతా ప్రచార ధామంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డి.వి.రమణ తెలిపారు.

## ఘనంగా శివాజీ మహరాజ్ శోభాయాత్ర


శివాజీ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న శివాజీ యూత్ సభ్యులు

కర్నూలు కల్చరల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని సోమవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. బాల శివాజీ యూత్ ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఓల్డ్‌సిటీలోని బండి మెట్ట నుంచి నగరంలోని పూలబజార్, అంబేడ్కర్ విగ్రహం, కొండారెడ్డి బురుజు, కోట్ల సర్కిల్, పెద్దపార్క్, గాంధీనగర్ మీదుగా రాజ్ విహార్ వరకు శివాజీ మహారాజ్ విగ్రహంతో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. లలితా పీఠం పీఠాధి పతి మేడా సుబ్రహ్మణ్యం, పారిశ్రామిక వేత్త టీజీ భరత్, బీజేపీ నాయకులు కాశీ విశ్వనాథ్ శోభాయాత్రను ప్రారంభించి పాల్గొన్నారు. బాల శివాజీ యూత్ ప్రతినిధులు ప్రసాద్, కోటి, అరవింద్, శ్రీనాథ్, వినోద్, భువన్, గణేష్, శంకర్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రైలులో అయోధ్యకు శ్రీరామ భక్తులు


ప్రత్యేక ట్రైన్‌లో అయోధ్యకు బయలుదేరుతున్న భక్తులు

కర్నూలు కల్చరల్: శ్రీరామ భక్తులు వందలాది మంది సోమవారం ప్రత్యేక రైలులో అయోధ్యకు బయలు దేరారు. విజయవాడ నుంచి అయోధ్యకు ఏర్పాటు చేసిన 20 కోచ్‌ల ప్రత్యేక ట్రైన్‌లో కర్నూలు నుంచి 360 మంది బీజేపీ, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్ దల్ సంస్థలతో పాటు వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, శ్రీరామ భక్తులు అయోధ్యకు వెళ్లారు. వీరు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు అక్కడికి చేరుకొని బుధవారం రామ్‌లల్లాను దర్శించుకోనున్నారు. అంతకు ముందు రైల్వే స్టేషన్‌లో చత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కగ్గోలు హరీష్‌బాబు, బజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి తదితరులు శివాజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రత్యేక రైలుకు వీడ్కోలు పలికారు.

## నేత్రపర్వం.. వెంకటేశ్వరుని కల్యాణోత్సవం


స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న పురోహితులు,


హాజరైన మహిళా భక్తులు

ఓర్వకల్లు: మండలంలోని శకునాల గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 21వ తేదీ ప్రారంభమైన 'గడప గడపకు గోవు, గోవిందుడు గీత' పేరుతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన జనజాగారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని శకునాల గ్రామానికి చేరుకుంది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పురసంకీర్తనల మధ్య స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నయనానందకరంగా నిర్వహించారు. ఈ సంకల్పానికి తోడుగా, వందలాది మంది భక్తులు పాల్గొని భక్తి ఉద్యమానికి తోడుగా నిలిచారు. లక్ష్మీ వేంకటేశ్వరస్వామి భజన కమిటీ భజనగీతాలతో భక్తులను చైతన్య పరిచారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. సంస్థ ప్రతినిధి గట్టు అరుంధతి రంగాచార్య మాట్లాడుతూ.. సనాతన భారతీయ వైదిక ధర్మాల్లో గోవు, గోవిందుడు, గీతకు ఎంతో ప్రాధ్యాతన ఉందని తెలిపారు. అనంతరం భక్తులకు భగవద్గీత గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు.

## సుబ్రమణ్యేశ్వరుడి ఆదాయం రూ. 14.80 లక్షలు


వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో టెంకాయల వేలం ద్వారా రూ.14.80 లక్షలు వచ్చాయని ఈఓ రామక్రిష్ణ సోమవారం తెలిపారు. ఏడాది పాటు ఆలయ ప్రాంగణంలో టెంకాయలు విక్రయించేందుకు వేలంపాట నిర్వహించామన్నారు. ఐదుగురు పాటదారులు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి అందరికన్నా ఎక్కువగా రూ. 14.80 లక్షలకు పాడి దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది అదనంగా రూ. 40వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గడివేముల ఈఓ మోహన్, క్రిష్టారెడ్డి, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో సమస్యలకు పరిష్కారం


జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చే వినతులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో నగరపాలక ఎస్ ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశిలత, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

**ఫిర్యాదుల్లో కొన్ని..**

- ఇంటి పట్టా ఇవ్వాలని ఎస్. షకీరాబేగం అనే మహిళా విన్నవించింది.
- తమ స్థలాన్ని సర్వే చేయించాలని ఫైజాది అనే మహిళ అభ్యర్థించారు
- సేవా మిత్ర ద్వారా వచ్చిన రూ.15 వేలు ఇవ్వాలని కె. రిబ్కా అనే వలంటీర్ కోరారు.
- తమ కాలనీలో రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని రిచ్‌మండ్ హోమ్స్ ఫేజ్-1 కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. సురేంద్రనాయక్ అర్జీ అందజేశారు.
- అన్యాక్రాంతమైన స్థలంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను నిలిపి వేయాలని నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ అధ్యక్షుడు నాగరాజు ఫిర్యాదు చేశారు.

## వినియోగదారులను హక్కులపై చైతన్యం చేయండి


మాట్లాడుతున్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్

కర్నూలు (లీగల్): వినియోగదారులను సేవా లోపం, మోసాలపై న్యాయ పోరాటం చేసేలా జాగృత పర్చాలని ప్రసూన న్యాయ కళాశాల విద్యార్థులకు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సూచించింది. న్యాయ స్థానాల పరిశీలన (కోర్టు అబ్జర్వేషన్)లో భాగంగా సోమవారం ప్రసూన న్యాయ కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థులు కళాశాల డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ శివకుమార్ నేతృత్వంలో కమిషన్‌ను సందర్శించారు. వినియోగదారులు తమ హక్కులపై చైతన్యమై ప్రశ్నించినప్పుడే న్యాయం జరుగుతుందని అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. వినియోగదారుల కమిషన్ సమర్థవంతంగా పనిచేస్తోందని, ఇందుకు కమిషన్ ఇచ్చిన తీర్పులే నిదర్శనమని డీన్ డాక్టర్ జేవీ శివకుమార్ పేర్కొన్నారు. న్యాయ శాస్త్రం చదివిన విద్యార్థులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, ఆయా అవకాశాలను అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ప్రసూన న్యాయ కళాశాల పూర్వ అధ్యాపకులు, కమిషన్ సభ్యులు ఎన్.నారాయణరెడ్డి సూచించారు. న్యాయవాది అవసరం లేకుండానే వినియోగదారుడు తమకు జరిగిన అన్యాయం, సేవా లోపంపై తనకు వచ్చిన భాషలో ఫిర్యాదు దాఖలు చేసుకుని, వాదనలు వినిపించుకోవచ్చని సభ్యులు నజీమా కౌసర్ పేర్కొన్నారు. వినియోగదారులు తమకు జరిగిన నష్టంపై సరైన ఆధారాలతో కోర్టును ఆశ్రయించి న్యాయం పొందొచ్చని అధ్యాపకులు మొఫూజ్ పాషా, మహ్మద్ హసేన్ ఖాన్ సూచించారు. అంతకు ముందు వినియోగదారుల వివాదాలకు సంబంధించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలను వారు నివృత్తి చేశారు.

## పెళ్లికి దాచిన సొమ్ము బూడిదపాలు


కాలిపోయిన నగదు, బంగారు, వెండి నగలు

దేవనకొండ: కరివేముల గ్రామంలో కటిక మోహన్ ఇంట్లో సోమవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల దాకా ఆస్తినష్టం వాటిల్లింది. బంగారం 8 తులాలు, వెండి 20 తులాలు, రూ.6 లక్షలు దాకా నగదు కాలి బూడిదైందని బాధితుడు కటిక మోహన్‌రావు, నాగేశ్వరావు వాపోయారు. తమ చెల్లి పెళ్లి ఉండడంతో నగదును అప్పుగా ఇతరుల నుంచి తీసుకొని, బంగారాన్ని కొనుగోలు చేసి ఇంట్లోని పెట్టెలో దాచుకోవడం జరిగిందన్నారు. ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో మొత్తం కాలి బూడిదయ్యిందని కన్నీరుమున్నీరయ్యారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## దోమతెరకు నిప్పంటుకొని వ్యక్తికి తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా: ప్రమాదవశాత్తు దోమతెరకు నిప్పంటుకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జూపాడు బంగ్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన రమణయ్య ఇంటికి సమీపంలో ఉన్న పశువుల రేకుల షెడ్డులో దోమతెర పెట్టుకొని మంచంపై నిద్రించసాగాడు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో అకస్మాత్తుగా ఫ్యాన్‌కు షాట్‌సర్క్యూట్ సంభవించటంతో నిప్పురవ్వలు దోమతెరపై పడ్డాయి. అవికాస్త రగులుకొని మంటలు వ్యాపించటంతో మంచంపై గాఢనిద్రలో ఉన్న రమణయ్యకు అంటుకున్నాయి. వెంటనే అతను గట్టిగా కేకలు వేయగా పక్క గదిలో నిద్రిస్తున్న మనుమడు పరుగెత్తుకొచ్చి దుప్పటితో మంటలను ఆర్పివేశారు. తర్వాత క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## చెన్నకేశవస్వామి రాజగోపుర పనులకు శంకుస్థాపన

- రాజగోపురానికి సీజీఎఫ్ నుంచి రూ.50 లక్షలు మంజూరు
- పురాతన ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు తోడ్పడాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం చెన్నకేశవస్వామి ఆలయంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న మూడు అంతస్తుల రాజగోపురానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ ముఖ్య ద్వారంలో నిర్మిస్తున్న రాజగోపురానికి సీజీఎఫ్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో దాతల సహకారం అభినందనీయమన్నారు. పురాతన దేవాలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. అదేవిధంగా గ్రామ నడిబొడ్డులో నిరుపయోగంగా ఉన్న పురాతన భవన యజమానులు సహకరిస్తే దాని స్థానంలో ప్రజలకు ఉపయోగపడే ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పారిశ్రామిక ప్రభావిత, ప్రభావేతర ప్రాంతాలకు రూ.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అవసరమైతే కలెక్టర్‌తో మాట్లాడి ఈ నిధులతో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. జైరాజ్ ఇస్పాత్‌కు పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని గ్రామ ప్రజల సౌలభ్యం కోసం ఉపయోగపడేలా చూడాలని నాగలింగేశ్వరరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కంపెనీ యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. అంతరం రాజగోపుర నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలను ఎమ్మెల్యే కాటసాని సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి, ఈఓ మద్దిలేటి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సర్పంచ్ నాగేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ పెద్దయ్య, సింగిల్ విండో చైర్మన్లు చంద్రశేఖర్ రెడ్డి, నాగతిరుపాలు, నాయకులు శంకర్‌రెడ్డి, మీనిగ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.